

ఇవిఎంలపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - గోపాలపురం

ఎన్నికలకు సంబంధించి ఓటర్లు ఓటు వేసేందుకు కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాడ్‌లపై సెక్టోరల్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తహశీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. గురువారం గోపాలపురం జిఎంసి బాలయోగి గురుకుల ఆశ్రమ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాడ్‌లను సిద్ధం చేసే విధానంపై సెక్టోరల్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రైనీ కలెక్టర్ సువర్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనర్లను సుబ్రహ్మణ్యం, శంకరుడు, ఫణి, నాగేంద్ర ప్రసాద్, ఆనందరావు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వల

- జిల్లా వ్యాప్తంగా మొదలైన అడ్మిషన్ల వేట
- తల్లిదండ్రులకు ఫోన్, ఎస్ఎంఎస్‌ల జోరు
- ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రచారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పదో తరగతి పరీక్షలు పూర్తి కాక ముందే కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు విద్యార్థులకు వల వేస్తున్నాయి. కళాశాలల యాజమాన్యాలు ఏకంగా గ్రామల్లో సైతం మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరించి మొబైల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు చేస్తూ ఊదరగొడుతున్నారు. ఎలాగోలా బుట్టలో వేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలు పూర్తి అయిన తరువాతనే అడ్మిషన్లు నిర్వహించాలి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ముందుగానే సీటును రిజర్వ్ చేసుకుంటే రాయితీలు కల్పిస్తామంటూ లేనిపోని ప్రకటనలతో కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలు చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి.



ప్రకటనలతో దర్శనమిస్తున్న ఓ ప్రయివేటు జూనియర్ కళాశాల

తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కాలేజీలో చేర్పాలోనన్న ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులు యోచిస్తున్నారు. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్పుకునేందుకు ఇంటింటా, ఫోన్, ఎస్ఎంఎస్‌ల ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతోపాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయనీ, చేరితే రాయితీలు ఇస్తామంటూ ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు.. ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్నారు. తమ కళాశాలలో చేర్పిస్తే ఫీజు రాయితీ ఇస్తామనీ, సౌకర్యాలు కల్పిస్తామనీ, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామనీ, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు. ఎవరి డప్పు వారిది.

రాజమహేంద్రవరం, కాకినాడలతో పాటు విజయవాడ,విశాఖపట్నం విద్యాసంస్థలు ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ సంస్థల ఉన్నాయనీ, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందనీ, చేరాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలు కూడా విద్యార్థులపై వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, ఏఐఈఈఈ, ఐఐటీ, జేఈఈ మెయిన్స్, ఎన్ఇఇటి శిక్షణ ఇస్తామని, పిల్లల్ని బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నారు. కళాశాలలో ఏసీ, నాన్ ఏసీ, డేస్కాలర్, హాస్టల్, మెస్ తదితర ప్రత్యేకతలు వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. వెంటనే డబ్బు చెల్లించి, సీటు ఖరారు చేసుకోవాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. మెరుగైన మార్కులు సాధించిన వారికి ప్రత్యేక రాయితీలు అంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల మాయమాటలు నమ్మి, కొందరు పిల్లలను చేర్పిస్తున్నారు. మరి కొందరు కళాశాల చూసిన తరువాత చెబుతామని బదులు ఇస్తున్నారు. ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామని సంస్థలు చెబుతున్నాయి. ఫీజులు కూడా రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అడ్మిషన్లకు షెడ్యూలు ప్రకటించలేదు

ఇంటర్మీడియెట్ అడ్మిషన్లకు బోర్డు నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. షెడ్యూలు ప్రకటించిన అనంతరమే అడ్మిషన్లు తీసుకోవాలి. బోర్డు నుంచి అనుమతులు రాకముందే అడ్మిషన్ల ప్రక్రియ చేపడితే చర్యలు తప్పవు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలి.

- ఎన్ఎస్‌విఎల్ నర్సింహం, ఆర్ఐఒ, తూర్పుగోదావరి

ఎర్రజెండా స్థూపాలను కూల్చడం సరికాదు

సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు మధు, అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో ఎన్నికల నియమావళి పేరుతో అనేకేళ్లుగా వివిధ కార్మిక సంఘాలు పోరాట చిహ్నలుగా ఏర్పాటు చేసుకున్న ఎర్రజెండా స్థూపాలను నగరపాలక సంస్థ కూల్చి వేయడాన్ని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ తీవ్రంగా ఖండించారు. 50 ఏళ్లకు పైబడి నగరంలో వివిధ కార్మిక సంఘాలు, ముఖ్యంగా కమ్యూనిస్టు అనుబంధ కార్మిక సంఘాలు ఆయా ప్రాంతాల్లో తమ పోరాటాలకు, హక్కులకు బాసటగా ఉన్న ఎర్రజెండా స్థూపాలను ఏర్పాటు చేసుకున్నాయన్నారు. ఈ కాలంలో అనేక ఎన్నికలు జరిగినా నియమావళి పేరుతో ఎప్పుడూ వాటిని కూల్చలేదన్నారు. ఈసారి మాత్రం అధికారులు అత్యుత్సాహం చూపిస్తూ ముఖ్యంగా గత ఐదేళ్ల కాలంలో ప్రజా సమస్యలపైన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన ఎర్రజెండా స్థూపాలను లక్ష్యంగా చేసుకుని కూల్చివేస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణం ఈ కూల్చివేతలను ఆపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జేసి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కోలమూరు పంచాయతీలో ప్యాక్ సొసైటీలో ఏర్పాటు చేసిన 40వ నెంబరు పోలింగ్ స్టేషన్‌ను జెసి తేజ్‌భరత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ స్థాయి అధికారి పేరు, ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఆ మేరకు అక్కడ గోడపై స్పష్టంగా పెయింటింగ్ చేయాలని ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్నామని తెలిపారు. పోలింగ్ బూత్‌లో మౌలిక వసతుల కల్పన, తీసుకున్న చర్యలను బూత్ స్థాయి అధికారి కె.నిఖిత ఆయనకు వివరించారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో 85 ఏళ్లు దాటిన ఓటర్లు, 40 శాతం పైబడిన ఓటర్ల వివరాలు సేకరించి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోం ఓటింగు కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ వైకెవి.అప్పారావు, జిల్లా సహకార సంఘం అధికారి వై.ఉమామహేశ్వరరావు, బిఎల్ఒ కె.నిఖిత తదితరులు ఉన్నారు.8



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి తేజ్ భరత్

ఎస్‌కెఆర్ కళాశాలను సందర్శించిన నాక్ బృందం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలను నాక్ బృందం గురువారం పరిశీలించిందని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి తెలిపారు. నాక్ పర్యవేక్షణ బృందం చైర్మన్ ప్రొఫెసర్ పి.నారాయణస్వామిపాపన్న, యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ విసి షిమోగా, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్.గీతారాణి, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ మెంబర్ డాక్టర్ ధనరాజ్‌శెట్టి, నాగపూర్ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ యశోద తదితరులు ఈ బృందంలో ఉన్నారన్నారు. వారికి అధ్యాపకులు, ఎన్‌సిసి విద్యార్థులు స్వాగతం పలికారు. రెండు రోజులపాటు కళాశాలలో అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిట్ మీట్‌లో పరిశీలించిన అన్ని అంశాలపైనే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలను సైతం బృందం కొనియాడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, నాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునీత పాల్గొన్నారు.



ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న నాక్ బృందం

22 మంది వాలంటీర్ల సస్పెన్షన్

రాజమహేంద్రవరం : వైసిపికి అనుకూలంగా పని చేస్తున్న వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలని తాము అందించిన ఫిర్యాదుకు స్పందించి రిటర్నింగ్ ఆఫీసర్ 22 మంది వాలంటీర్లను సస్పెండ్ చేశారని టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము వాలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అయితే కొంతమంది వాలంటీర్లు వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ నిర్వహించిన సమావేశాలకు హాజరయ్యారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసిపికి ఓట్లు వేయాలంటూ కొంతమంది వాలంటీర్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, అది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. కాబట్టి తగు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి దినేష్ కుమార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన ఆయన 22 మంది వాలంటీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

డ్రై డే ఫ్రైడేపై అవగాహన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు పిహెచ్‌సి పరిధిలో కానూరు, మునిపల్లి, కానూరు-2 ప్రాంతాల్లో మస్కిటో లార్వా డెన్సిటీ, వెక్టార్ కంట్రోల్ హైజీన్, ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కదలిక లేని నీటిపై మాత్రమే దోమ గుడ్లు పెడుతుందన్నారు. కావున నీటిని నిల్వలేకుండా చూడాలన్నారు. సూర్యోదయానికి ముందు, సూర్యాస్త మయానికి తర్వాత ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి ఉంచరాదన్నారు. డ్రెయినేజీల్లో చెత్తను వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె.హేమరాజ్, హెల్త్ సూపర్‌వైజర్ కెవి.నాగేశ్వరరావు, విలేజ్ హెల్త్ సెక్రెటరీలు ఎస్.రేవతి, ఎస్.వెంకాయమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ జి.అంబేద్కర్, డి.నాగేశ్వంరావు, ఎం.శ్రీనివాస్ ఆశాకార్యకర్తలు ఎం.దుర్గాభవాని, సిహెచ్.సుమలత, ఎం.లక్ష్మి, ఎం.ఆదిలక్ష్మి తదితరు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం దుళ్ల పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లను నిర్మించేందుకు వాషీ సంస్థ రూ.2.12లక్షలను మంజూరు చేసింది. ఇందులో భాగంగా 10 శాతం నిధులు రూ.21,200లను హెచ్‌ఎం వివి.శశికుమారికి ఆదర్శ రైతు సత్తి భాస్కర్‌రెడ్డి(కంద రెడ్డి) గురువారం విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు బి.అబ్బాయి, జి.పాపారావు, డిఎన్.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల నేపథ్యంలో మీడియాలో ప్రకటనలకు 48 గంటల ముందుగానే అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం ఎంసిఎంసి తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. ఎన్నికల నియమావళిని అనుసరించి వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ మాధ్యమాల్లో ప్రచారం చేస్తారన్నారు. ముఖ్యంగా మూడు అంశాలపై ఎంసిఎంసి కమిటీ దృష్టి పెట్టాలన్నారు. అనుమతి తీసుకుని ప్రచురించిన, ముందస్తుగా అనుమతి లేకుండా ప్రచురించిన, రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు ఇచ్చిన ఫిర్యాదులకు చెంది ప్రింట్ మీడియాలో ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రకటనలను గమనించాల్సి ఉంటుందన్నారు. ఆయా ప్రకటనలు, ప్రచార అంశాలు, చెల్లింపు వార్తలు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ఉల్లంఘన, ఖర్చుల వివరాలపై ఆయా బృందాలకు నివేదికలను అందించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కనీసం 48 గంటల ముందుగా అనుమతిని కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆ మేరకు నిర్ణీత ఫారం - ఎ ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకున్న తదుపరి, సంబంధిత పత్రాలను అందించాలన్నారు. ఎంసిఎంసి ఆధ్వర్యంలో పరిశీలనా చేసిన తరువాత ధ్రువీకరణ పత్రాన్ని ఆయా అభ్యర్థుల పేరున జారీ చేస్తారన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేసే ప్రకటనలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. ప్రసారం చేసే వీడియో కంటెంట్‌లను నిశితంగా పరిశీలించిన తరువాతనే అనుమతులు ఇస్తారన్నారు.

ఆయా పత్రికలు, ఛానళ్లు, రేడియో, ఎఫ్ఎమ్ చానల్స్, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వాటినీ నిశితంగా పరిశీలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్ని విధి విధానాలను అనుసరించిన తర్వాత పత్రికలు, ఛానెల్ యొక్క ప్రామాణిక రేట్ కార్డ్‌ల ప్రకారం ఖర్చులను అభ్యర్థుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. నామినేషన్ దాఖలు చేసే సందర్భంలో అభ్యర్థుల సోషల్ మీడియా వివరాలు, సోషల్ మీడియా ప్రమోటింగ్ చేసే ఏజెన్సీ వివరాలూ తెలియజేయాల్సి ఉంటుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ఎన్నికలు జరిగే రోజున, అంతకు ముందు రోజున ఎటువంటి ప్రకటనలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో రావడానికి వీలు లేదన్నారు. ఆమేరకు రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, మీడియాకు, ప్రింటర్స్‌కి అవగాహన కల్పించాలన్నారు. రాజకీయ పార్టీ లేదా అభ్యర్థి ఇచ్చే ప్రకటనలకు చెందిన వ్యవధి, విషయం/ప్రకటనతో పాటు ప్రచురణకర్త పేరు మరియు చిరునామా తప్పకుండా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.నరసింహులు, రాజమండ్రి పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణనాయక్, సమన్వయ కర్త జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సిహెచ్.శ్రీనివాస్, సభ్యులు ఆలిండియా రేడియో స్టేషన్ ఇంఛార్జి కెవిఎస్ఎం.మూర్తి, ఆర్ట్స్ కళాశాల సహాయ ప్రొఫెసర్ బి.సునీల్‌కుమార్, సహాయ కార్మిక కమిషనర్ బిఎస్ఎం.వలీ, ఎఒ బివిఎస్.రామారావు, పిఆర్ఒ ఎం.లక్షణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుపై బైండోవర్ ప్రయత్నాలు తగదు

కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సిపిఎం నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబుపై అక్రమ బైండోవర్ కేసు పెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని ఆ పార్టీ నాయకులు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతకు వినతిపత్రం అందించారు. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బైండోవర్ కేసు పెడతామంటూ నిడదవోలు ఎస్ఐ అప్పారావు సిపిఎం నాయకులు జువ్వల రాంబాబుకు తెలిపారన్నారు. సిపిఎం జిల్లా నాయకుడు పైగా దళిత సామాజిక వర్గానికి చెందిన విద్యావంతుడు, ఎలాంటి క్రిమినల్ చరిత్రలేని వ్యక్తిపై ఇలా బైండోవర్ కేసు పెడతామని చెప్పడం వెనుక దురుద్దేశాలు ఉన్నాయని భావించాల్సి వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించిన కారణంగానే ఇలాంటి నిర్బంధం విధించాలని చూడటం అధికార పార్టీ ప్రయోజనాలను కాపాడుకునేందుకే అని భావించాల్సి వస్తుందన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘన జరగకుండా ఆపాలని, రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, సిపిఎం నగర కార్యదర్శి బి.వపన్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చివటంలో గురువారం పర్యావరణ పరిరక్షణ, రైతుల సమస్యలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేరు చేయాల్సిన ప్రాధాన్యత గురించి, పర్యావరణ పరిరక్షణ గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. గ్రామంలోని రైతులను కలిసి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు, పురుగు మందులు వాడేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి విష్ణువర్ధన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పవన్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదు

రాజమహేంద్రవరం ఎంపీ భరత్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదని, ఆయనకంటూ ఒక ఆలోచన, లక్ష్యం లేదని, కేవలం చంద్రబాబు పల్లకీ మోయడానికే రాజకీయాల్లోకి వచ్చారని ఎంపీ మార్గాని భరత్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి నుంచి అభ్యర్థులుగా పోటీ చేస్తున్నవారిని జనసేన పార్టీలోకి ఆహ్వానించడంలోనే ఆయన రాజకీయ పరిజ్ఞానం ఎటువంటిదో అవగతమవుతుందన్నారు. పవన్ వ్యక్తిగతంగా మంచి వారై ఉండొచ్చు..కానీ ఆయనను సిఎంగా చూడాలని ఆశించే ఒక సామాజిక వర్గం, ఆయన అభిమానుల ఆశలను చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టడం శోచనీయం అన్నారు. పవన్ ఎంత సేపూ చంద్రబాబును సీఎం చేయడానికి ఆరాటపడుతున్నారే తప్ప, పదేళ్లుగా పార్టీ నడుపుతూ ప్రజల ఆకాంక్షలకు విలువ ఇవ్వకపోతే ప్రయోజనం ఏమిటన్నారు. పొత్తులో భాగంగానైనా పవన్ సామాజిక వర్గానికి ఏమి న్యాయం చేయగలిగారని ప్రశ్నించారు. కాకినాడ జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని కాపు సామాజిక వర్గానికి ఇచ్చిన ఘనత వైసిపికి దక్కుందన్నారు. మరి బరిలో ఉన్న కూటమి ఎన్ని స్థానాలు ఇచ్చిందో ధైర్యంగా ఆ కూటమి నేతలు చెప్పగలరా అన్నారు. రాజకీయాల్లో మార్పు కోసం పార్టీ పెట్టానని పవన్‌కళ్యాణ్ చెప్పుకుంటారని, ముందు ఆయనలో, ఆయన ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. పార్టీ స్థాపన దేనికి, లక్ష్యం ఏమిటి..పది సంవత్సరాలైనా ఎదుగూ బొదుగూ లేకుండా ఇలాగే ఉండటానికి కారణాలేంటో పవన్ గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే చంద్రబాబు పల్లకీ మోయడం తప్పిస్తే మరే మార్పు పవన్‌లో ఉండబోదని ఎంపీ భరత్ స్పష్టం చేశారు.

కార్టూ'నిజం'



జాతీయస్థాయి పోటీలకు సత్యసాయి విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీసత్యసాయి గురుకులం పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ ఫ్యూచర్ స్కేప్స్ - ది హిందూ యంగ్ వరల్డ్ ఆధ్వర్యంలో రీజనల్ స్థాయిలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీ సత్యసాయి గురుకులం ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. సబ్ జూనియర్స్ విభాగంలో ఐదో తరగతి విద్యార్థి ఎం.అర్హ్నశ్రావణ్, సీనియర్స్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి డి.హర్షవర్ధన్ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఏడో తరగతి విద్యార్థిని ఎ.దీక్షితవల్లి జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. సబ్ జూనియర్స్ విభాగంలో ఐదో తరగతి విద్యార్థిని జి.భావన, జూనియర్స్ విభాగంలో ఏడో తరగతి విద్యార్థిని వి.శ్రీవత్సశ్రావణి కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారు. వీరికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర జ్ఞాపికలు, ప్రసంశాపత్రాలను అందించారు. విజయం సాధించిన విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ టీచర్లు మోటూరి శ్రీనివాస్, దార్ల శివాజీలను కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్, ప్రిన్సిపల్ గురయ్య అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు హర్షవర్ధన్, అర్హశ్రావణ్



జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందుకుంటున్న దీక్షితవల్లి, శ్రీవత్సశ్రావణి, భావన

మొక్కలతోనే జీవుల మనుగడ

ప్రజాశక్తి - గోపాలపురం

మొక్కలతోనే జీవులు మనుగడ సాధ్యమని హెచ్‌ఎం డి.సుబ్బారావు తెలిపారు. గురువారం బిసి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. జీవ వైవిధ్యానికి అడవులు, చెట్లు ప్రాముఖ్యతను తెలిపేందుకు మార్చ్ 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. అడవుల విశిష్టతను తెలిపారు. ప్రకృతిని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మెడికల్ విభాగం నుంచి సిహెచ్‌ఒ ఎ.అరుణ, ఆశా వర్కర్ డి.లక్ష్మి, ఉపాధ్యాయులు తలారి నరేష్, సిఆర్‌పి కొయ్య నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మదనగోపాలస్వామి రథోత్సవం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడిలోని మదనగోపాలస్వామి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో బుధవారం రాత్రి కళ్యాణం జరిగింది. గురువారం రథోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ నక్కా వెంకట అనురాధ దంపతులు గోకవరపు వంశీకులకు ఆలయ కమిటీ మేళతాళాలతో స్వాగతం పలికింది. సొలస ఉమ కంచర్ల రామకష్ణ, కంకిపాటి వినయ్, ఎస్.బాలాజీ కంకిపాడు వంశీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మాలలకు టిడిపి మొండిచేయి'

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

టిడిపి మాలలకు మొండి చేయి చూపిందని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ అన్నారు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు ఎస్‌సి నియోజకవర్గాలు ఉండగా కనీసం ఒక్క నియోజకవర్గంలోనూ మాలలకు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. అలాగే కృష్ణ జిల్లాలో మూడు నియోజకవర్గాలకు ఒక్క మాల అభ్యర్థినీ కేటాయించకుండా అన్యాయం చేశారన్నారు. కడప, అనంతపురం జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టిడిపి మాలలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పునరాలోచన చేసి మాలలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. లేకుంటే పార్టీకి తీవ్రనష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు

వైసిపిలోకి నున్నం రాంబాబు

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి సీనియర్ నాయకులు, పోల్ మేనేజ్‌మెంట్ మండల యూనిట్ కన్వీనర్ నున్నం రాంబాబు తన అనుచరులు 50 మందితో కలిసి గురువారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ సమక్షంలో వారు పార్టీలో చేరారు. వారికి రాంజీ కండువాలను కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నున్నం రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు, ఎంఎల్‌ఎ అభ్యర్థి తోట నరసింహం పాలనా సమర్థత పట్ల నమ్మకంతోనే వైసిపిలో చేరుతున్నామన్నారు. త్వరలోనే తోట నరసింహం సమక్షంలో కొత్తపల్లి నుంచి వేయిమంది వరకూ వైసిపిలో చేరనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, పార్టీ మండల అధ్యక్షులు పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, ఎస్‌సి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుమంగళి తదితరులు పాల్గొన్నారు.



రాంబాబును వైసిపిలోకి ఆహ్వానిస్తున్న రాంజీ

వేడెక్కిన రాజోలు రాజకీయం

మారుతున్న రాజకీయ సమీకరణాలు
మాజీ మంత్రిని ఢీ కొట్టనున్న మాజీ ఐఎఎస్
గెలుపుపై ఇరుపార్టీల ధీమా

ప్రజాశక్తి- రాజోలు


అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు నియోజకవర్గంలో రాజకీయాలు హీటెక్కాయి. జిల్లాలో చివరి నియోజకవర్గం రాజోలులో రాజకీయం ఆసక్తికరంగా మారింది. కొద్ది రోజులుగా నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్న వైసిపి అధిష్టానం రాజోలు సీటుపై క్లారిటీ ఇచ్చింది. 2019 ఎన్నికలలో జనసేన నుంచి పోటీ చేసి గెలిచిన రాపాక వరప్రసాదరావుకు అవకాశం ఇవ్వకుండా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు టిడిపిని వీడి వైసిపిలోకి చేరడంతో ఆయనకు సీటు ఇచ్చారు. రాజకీయ బద్ధశత్రువులైన రాపాక, గొల్లపల్లి ఒక్కటై 2024లో ఒకరు ఎంఎల్ఎగా మరొకరు అమలాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు.

గెలుపై వైసిపి ధీమా

2014 సార్వత్రిక ఎన్నిల్లో రాజోలులో టిడిపి అభ్యర్థిగా గెలిపొందిన గొల్లపల్లి సూర్యారావు 2019లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. మరలా 2024లో టిడిపి నుంచి సీటు ఆశించినప్పటికీ పొత్తులో భాగంగా తనకు సీటు ఇవ్వకపోవడంతో వైసిపిలో చేరిన గొల్లపల్లి కొద్ది రోజుల వ్యవధిలోనే రాజోలు ఎంఎల్ఎ అభ్యర్థిగా సీటు తెచ్చుకుని తన రాజకీయ ఎత్తుగడకు తెరలేపారు. మొదట గొల్లపల్లికి రాపాక సహకారం లేకపోవడం మిగిలిన అసంతృప్తి వర్గం గొల్లపల్లికి జై కొట్టడంతో అధిష్టానం ఆదేశాల మేరకు రాజోలు ఎంఎఎల్ఎ రాపాక వరప్రసాద్ కూడా గొల్లపల్లిని గెలిపించాలని అన్ని మండలాల శాఖలకు సమాచారం ఇవ్వడంతో వైసిపి కేడర్ మొత్తం ఒకతాటి పైకి వచ్చింది. దీనికి తోడు రాజోలు నియోజకవర్గంలో పదేళ్లుగా గొల్లపల్లి సుపరిచితుడు కావడం ఆయనకు కలిసి వచ్చే అంశంగా చెబుతున్నారు.

జనసేన పార్టీలో వర్గపోరు...!

రాజోలు నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థి రాపాక వరప్రసాద్ గెలవడం రాష్ట్రంలో ఒకే ఒక్క సీటు రాజోలు కావడంతో రాజోలు నియోజకవర్గంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రస్తుతం పొత్తు నేపథ్యంలో జనసేనకు సీటు కేటాయించడంతో ఆ పార్టీ అభ్యర్థిగా రిటైర్డ్ ఐఎఎస్ దేవ వరప్రసాద్ పేరును ప్రకటించారు. దీంతో జనసేన పార్టీలో వర్గపోరు మొదలైంది. టికెట్ ఆశించి వైసిపి నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన బొంతు రాజేశ్వరరావు తన వర్గం బొంతుకే సీటు కేటాయించాలని చేసిన రచ్చ ఇంతా అంతా కాదు. నాలుగేళ్ల నుంచి పార్టీలో పని చేస్తు జనసేనకు మైలేజీ తీసుకొచ్చిన చింతలమోరి సర్పంచ్ డాక్టర్ రమేష్ బాబు తనకు సీటు వస్తుందని ఆశించారు. అధిస్టానం ఎ.నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని తెలుపడంతో రమేష్ బాబుపై పార్టీలో సానుకూలంగా ఉన్నారు. ప్రత్యర్థి రాజకీయ కురవద్ధుడు గొల్లపల్లిని ఢీ కొట్టాలంటే టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థికి వర్గపోరు లేకుండా ఉంటేనే 2019 ఫలితం పునరావృతమవుతుందని అంటున్నారు.


గొల్లపల్లి సూర్యారావు


దేవ వరప్రసాద్

జగన్ పాలన ఇక ముగిసినట్టే

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జగన్ పాలన ఇక ముగిసినట్టేనని కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ రాజమహేంద్రవరం ఇన్‌ఛార్జి అత్తి సత్యనారాయణ అన్నారు. గురువారం 40వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ సింహ నాగమణి, తెలుగు యువత కమిటీ సభ్యులు సింహ వెంకటేష్, కొల్లి నాని తదితరుల ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టిడిపి రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు తదితరులతో కలిసి వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్, అత్తి సత్యనారాయణ మాట్లాడారు. 'నేను ఉన్నాను, నేను విన్నాను' అని చెప్పి గెలిచిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను జగన్ మోసం చేశారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో సిద్ధం అంటూ రావడాన్ని సిగ్గు లేదా? అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల పేరిట ప్రజల సొమ్మును వసిపి నేతలు దోచుకుంటున్నారన్నారు. నేడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావట్లేదని విమర్శించారు. పన్నులు, ఛార్జీలు, పెరిగిన ధరలతో సామాన్యుల జీవనం కష్టతరంగా మారిందన్నారు. ఈ తరుణంలో రానున్న ఎన్నికల్లో వైసిపికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీలో పాల్గొన్న ఆదిరెడ్డి వాసు

చిత్రలేఖనం పోటీలకు 120 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ ఫ్యూచర్ స్కేప్స్ - ది హిందూ యంగ్ వరల్డ్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు 120 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రీజినల్ స్థాయిలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర పాల్గొని మాట్లాడారు. ఇలాంటి పోటీలు సృజనాత్మకతకు దోహదం చేస్తాయన్నారు. కళాశాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కళాశాలలో 1.20 లక్షల పుస్తకాలతో లైబ్రరీ, ప్రయోగశాలలు ఉన్నాయన్నారు. బ్రిటీష్ వారి కాలంలో దక్షిణ భారతదేశంలో స్థాపించన మూడు ప్రధాన విద్యాసంస్థల్లో ఇదొకటిగా నిలిచిందన్నారు. అనంతరం విజేతలకు ఆయన జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సీతామహాలక్ష్మి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు సయ్యద్ ఫర్హాయస్రూన్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు కెపిబిఎల్.సరోజ, సిహెచ్.రామారావు, ఎ.రామకృష్ణ, కె.లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు. ది హిందూ రీజినల్ హెడ్ ఐవిఎస్.పార్థసారథి, ది హిందూ అసిస్టెంట్ మేనేజర్ దుర్గా మల్లేశ్వరావు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేఖనం పోటీలకు హాజరైన విద్యార్థులు

రంపయర్రంపాలెంలో రాంజీ ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలో గురువారం మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. జగన్‌ను సిఎంగా, తోట నరసింహాన్ని ఎంఎల్ఎగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేగేశ్వరం ఏటిగట్టుపై వాహన తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని వేగేశ్వరపురం ఏటిగట్టు వద్ద గురువారం అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గురవయ్య మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నగదుపై నిఘాతోపాటు వెండి, బంగారం, ఇతర ప్రలోభాలకు గురిచేసే వస్తువులను అక్రమంగా రవాణా జరగకుండా ప్రత్యేక బృందాలు మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. రూ.50వేల కంటే అదనంగా నగదును తరలిస్తే తప్పకుండా తగిన పత్రాలను వెంట పెట్టుకోవాలన్నారు. లేకుంటే సీజ్ చేస్తామన్నారు. ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు.

'చంద్రం ముఠా'ను తక్షణం అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగిన బ్రహ్మయ్య హత్యకు కారకులైన చంద్రం ముఠాను తక్షణం అరెస్టు చేయాలిన దళిత, ఆదివాసి, హక్కుల, ప్రజా సంఘాలు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. గురువారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ హాల్లో బ్రహ్మయ్య సంతాప సభ జరిగింది. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సాధు మాల్యాద్రి, బహుజన రచయిత డెన్నిష్ రాయ్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. దుర్గాప్రసాద్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు వేల్పుల నరసింహారావు, జిల్లా అధ్యక్షులు జె.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ నాయుడు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎవి.రమణ, రిపబ్లిక్ పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకులు కోనాల లాజరు, రాజమహేంద్రవరం నగర కార్యదర్శి కె.జోజి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఆర్.తిరుపతిరావు, పిఒడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న మాట్లాడారు. 'చంద్రం, టాన్యాల ముఠా' చేసిన బ్రహ్మయ్య హత్యపై సమగ్ర విచారణ జరపాలని, హంతకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఇప్పటికీ నేరస్తులు ఎవరినీ అరెస్టు చేయక పోవడాన్ని వక్తలు ఖండించారు. విప్లవం ముసుగులో చంద్రన్న హత్య రాజకీయాలు విడనాడాలని డిమాండ్ చేశారు. చంద్రన్న, టాన్యాలు కేంద్ర నాయకులు అని చెప్పుకుంటూ గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలో అక్రమాస్తులు కూడబెట్టారని వక్తలు విమర్శించారు. వారి నేర సామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికే హత్య రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ ముఠా తమను ప్రశ్నించిన, ఎదురు తిరిగిన, నిలవేసిన, నిలదీసిన దళిత, ఆదివాసి, వెనుకబడిన వర్గాల నుంచి ఉద్యమంలోకి వచ్చిన నేతలనే లక్ష్యంగా చేస్తున్నారని విమర్శించారు. చంద్రన్న, టాన్యాల ముఠాలోని విప్లవ శ్రేణులు పునరాలోచించుకుని బయటికి రావాలని, వారికి రాజకీయ సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. హత్య రాజకీయాలకు వ్యతిరేకంగా బహుజనులు, విప్లవ శ్రేణులు, ప్రజా సంఘాలు రెండు తెలుగు రాష్ట్రాలలో పోరాడాలని పిలుపునిచ్చారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నిలక బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని జెసి తేజ్‌భరత్ అధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం, వైటిసి ప్రాంగణంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అనుబంధ విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించే క్రమంలో ఎన్నికల సిబ్బంది విధులను నిర్వర్తించడం కోసం అందుబాటులోకి సెక్షన్లు గుర్తించామన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు బాధ్యతలను సక్రమంగా జవాబు దారీతనంతో నిర్వహించాలన్నారు. ఎన్నికల నిమిత్తం సమావేశాలు నిర్వహించేందుకు కాన్ఫరెన్స్ రూమ్‌ను, సి-విజిల్, ఎంసిసి, సువిధ, తదితర కేంద్రాలను పరిశీలించామన్నారు. ఆయన వెంట రూరల్ తహశీల్దార్, సహాయ రిటర్నింగ్ అధికారులు వైవికె.అప్పారావు, రమాదేవి తదితరులున్నారు.

బాపిరాజును గుర్తించకపోవడం బాధాకరం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలంలో 2014- 19 సంవత్సరాల మధ్య టిడిపి, మండల ప్రజలకు ఎన్నో సేవలందించిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజును అధిష్టానం గుర్తించక పోవడం బాధాకరం అని ఆ పార్టీ మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ప్రియాంక కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి గెలవాలంటే నియోజకవర్గంలో నాయకుల సమన్వయం అవసరమన్నారు. ప్రస్తుతం ఉన్న సమన్వయ లోపాన్ని అధిష్టానం చక్కదిద్దాలని అంతవరకు సహాయ నిరాకరణ చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మాజీ సభ్యుడు కొటారు అనంతలక్ష్మి, నాయకులు ఏలేటి సత్యనారాయణ, సవలం రామకృష్ణ. శ్రీరామ్ చౌదరి, మల్లిపూడి కృష్ణారావు, బి.దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తాతిన సత్యనారాయణ

భరత్‌కు 50 వేల మెజార్టీ ఖాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న ఎన్నికల్లో వైసిపి రాజమహేంద్రవరం అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌కు 50వేల మెజార్టీ రావడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కడలి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ఇంకా అభ్యర్థులనే ఎంపిక చేయలేకపోయిందన్నారు. ఎక్కడ ఏ పార్టీకి ఓటేయాలని ప్రచారం చేసుకోవాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లో టిడిపి, జెఎస్‌పి, బిజెపిలు ఉన్నాయన్నారు. వైసిపికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలనే వైసిపికి పట్టం కడతాయన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు నందం స్వామి, గుత్తుల భాస్కర్, పీతా రామకృష్ణ, సోడదాసి సుందర్ సింగ్, ఉల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి -చాగల్లు

మండలంలోని మీనానగరం, ఊనగల్ల, ఎస్.ముప్పవరం, గరపాడు, నందింగంపాడు, చిక్కాల పాలెం గ్రామాల్లో కొవ్వూరు రూరల్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చాగల్లు ఎస్ఐ పి.నాగరాజు మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దానికి పోలీసు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహించామన్నారు.

'ఎంఎల్ఎగా కాదు కార్యకర్తగా పనిచేస్తా'

ప్రజాశక్తి - తాళ్లపూడి

తనను గెలిపిస్తే ఎంఎల్ఎగా కాకుండా కార్యకర్తలా అందరికీ అందుబాటులో ఉండి పనిచేస్తానని కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులతో ముప్పిడి గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ద్విసభ్య కమిటీ నాయకులు జె.సుబ్బరాయ చౌదరి, కి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కాకినాడ

బాడీ మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఈశా స్పా సెంటర్‌పై పోలీసుల బుధవారం అర్ధరాత్రి దాడి నిర్వహించారు. దీనికి సంబంధించి టూ టౌన్ సిఐ తెలిపిన వివరాలు..స్థానిక భానుగుడి జంక్షన్ ప్రాంతంలో కోటగిరి సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో ఉన్న ఈశా స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతుందనే సమాచారం రావడం జరిగిందన్నారు. దీంతో బుధవారం రాత్రి దాడి చేయగా కోల్‌కత్తాకు చెందిన ఒక మహిళ, ఇద్దరు విటులు, ఇద్దరు స్పా సెంటర్ నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గురువారం కోర్టుకు తరలించగా ఈశా స్పా సెంటర్ నిర్వాహకులను 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారన్నారు. స్పా, బ్యూటీ పార్లల్, సెలూన్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని క్రాస్ మసాజ్, వ్యభిచారం చేసేవారికి చట్టప్రకారం జైలు తప్పదని ఆయన హెచ్చరించారు.

కోడిపందేలపై దాడులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వసంతవాడ, ఆత్రేయపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ గురువారం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.900, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. ఆత్రేయపురం గ్రామ శివారున ఒకరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.600, ఒక కోడి, కోడి కత్తులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎపై తెలిపారు.

20 బైకుల రికవరీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చోరీలకు గురైన 20 బైకులను పోలీసులు రికవరీ చేశారు. ఎస్పి పి.జగదీష్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డిఎస్పి కె.విజయ్‌పాల్ పర్యవేక్షణలో రాజమహేంద్రవరం 3వ పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో బైకుల చోరీలపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. చోరీలకు గురైన కొద్దిరోజుల్లోనే ఈ బృందం 20 బైకులను రికవరీ చేసింది. 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 4, ప్రకాష్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో 3, 3వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో13 మొత్తంగా 20 బైకులను స్వాధీనం చేసుకున్నారు. గురుఆరం మధ్యవర్తుల సమక్షంలో రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ వద్ద మోటార్ సైకిళ్లను, చోరి చేసిన నిందితులను, చాకచక్యం గా పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బైకులను చోరీ చేసిన నిందితుల్లో బాలురే ఎక్కువగా ఉన్నారన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకొన్న ప్రత్యేక టీం ఎస్ఐ యువిఎస్.నాగబాబు, హెచ్‌సి పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు బి.విజయ్‌కుమార్, టివి.సత్యనారాయణలను అభినందించి, క్యాష్ రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి(లా అండ్ ఆర్డర్) అనిల్‌కుమార్, డిఎస్పి కె.విజయపాల్, సిఐ ఎస్.వీరయ్యగౌడ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం గ్రామ శివారు పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,420 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. నిందితులను అరెస్టు చేస్తామని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్సై టి రామకృష్ణ తెలిపారు.

ఎస్.యానాంలో ప్రపంచ అటవీ దినోత్సవం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్.యానాంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వేదాంత కెయిర్న్ ఆయిల్ కంపెనీ సహకారంతో మిత్ర హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ ఎస్ఎం పాషా, ఎఇ సోమన్‌దేవ్ సివిల్ ఇంజనీర్ కె.మహేష్, పాఠశాల హెచ్ఎం బి.అప్పారావు, కో ఆర్డినేటర్ బీర బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-మండపేట

ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో పలువురు గురువారం టిడిపిలో చేరారు. పడమరఖండ్రిక గ్రామానికి చెందిన వైసిపి నేతలు పెట్టెం చంద్రావతి, పెట్టెం సుబ్బారావు, తుట్టపు రామకృష్ణ, కొమ్మిశెట్టి సురేంద్ర, బొర్రా కృష్ణ కిషోర్, కొమ్మిశెట్టి నాగేశ్వరరావు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి ఎంఎల్ఎ జోగేశ్వరరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నీటి శుద్ధి యంత్రం అందజేత

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల పరిధిలోని మాచర జెడ్‌పి ఉన్నత పాఠశాలకు గురువారం నీటి శుద్ధి యంత్రాన్ని విద్యార్థులు బహూకరించారు. అదే పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సుమారు రూ.10 వేల విలువ గల నీటి శుద్ధి యంత్రాన్ని పాఠశాలకు అందజేశారు. ఆ యంత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులను అభినందించారు.

నామన ఫౌండేషన్ ఆధ్వర్యాన వికలాంగులకు ఆర్థిక సాయం

మామిడికుదురు : మగటపల్లిలో నామన ఫౌండేషన్ సౌజన్యంతో నామన కృష్ణవేణి జ్ఞాపకార్థం మగటపల్లి వద్ద గురువారం రోగులకు ఆర్థిక సాయం అందించారు. వికలాంగులకు ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు, బోర్డు మెంబర్స్ ఒకొక్కరికీ రూ.5 వేల చొప్పున 9 మందికి రూ.45 వేల సహాయం అందజేసారు. నాగుల్లంక వృద్ధాశ్రమంలో రూ.21 విలువ చేసే 8 మంచాలు, రూ.10 వేల విలువైన 10 ట్రంకు పెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నామన వినోద్, శతి, తిరుమల సీతా మహాలక్ష్మి, బొలిసెట్టి జయరామ్ పాల్గొన్నారు.

యానాం వార్తలు



కీర్తి పురస్కారం అందుకుంటున్న దేవదానం రాజు

కీర్తి పురస్కారం అందుకున్న దాట్ల

ప్రజాశక్తి - యానాం

ప్రముఖకవి, కథకుడు దాట్ల దేవదానంరాజుకు హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన సభలో సృజనాత్మక సాహిత్యంలో 'దాట్ల'కు కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేశారు. సభలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య టి.కిషన్‌రావు, మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్.రెడ్డి, రిజిస్ట్రార్ భట్టు పురస్కారాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దాట్లకు ప్రముఖకవి శిఖామణి, కవులు ముమ్మిడి చిన్నారి, పొనుగుమట్ల అశోక్‌కుమార్ అభినందనలు తెలిపారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సతీమణి లక్ష్మీ స్నేహ

వైభవంగా వెంకన్న కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - యానాం

మీసాల వెంకన్న కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవంలో మహోత్సవంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, లక్ష్మీస్నేహ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా యానాం ప్రజల పక్షాన ఎంఎల్ఎ దంపతులు స్వామికి ముత్యాల తలంబరాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కుటుంబీకులు, భక్తులు పాల్గొని స్వామి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరాలయానికి రూ .10.44 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. ఫిబ్రవరి 15 నుండి మార్చి 21 వరకు హుండీల ద్వారా రూ.10 లక్షల 44 వేల ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పితాని తారకేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, దేవాదాయ శాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ అర్చకులు దేవస్థానం సిబ్బంది, తాపేశ్వరం నుండి వచ్చిన సేవా సంఘం భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.